సాక్షి
తిరుపతి
శనివారం । 24 । జూన్ । 2023



స్విమ్స్‌లో అత్యాధునిక వైద్యం

తిరుపతి స్విమ్స్‌లో అత్యాధునిక వైద్యసేలందించేందుకు పూర్తిగా సహకరిస్తామని టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. - 10లో



ఆనంద దాంపత్యానికి..

యువతీయువకులు పెళ్లికి ముందే ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్నారు. అనారోగ్య సమస్యలు లేనివారినే ఎంచుకుంటున్నారు. - 10లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	26
చిత్తూరు	33	25
తిరుమల	30	22
గూడూరు	36	28
నగరి	35	26

న్యూస్‌రీల్

నేడు ఐఐటీలో ఓపెన్ హౌస్

ఏర్పేడు: ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో శనివారం జేఈఈ అడ్వాన్స్‌డ్-2023లో క్వాలిఫై అయిన విద్యార్థులకు ఓపెన్ హౌస్ నిర్వహించనున్నట్లు ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఐఐటీ తిరుపతిలో అందించే విద్య, వసతి, డ్యూయల్ డిగ్రీ, బ్రాంచి మార్పు, హాస్టల్ వసతి, ఆరోగ్యం, భవనాలు, తరగతి గదులు, అధ్యాపకుల బోధన తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఓపెన్ హౌస్‌కు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకున్న విద్యార్థులు హాజరుకావాలని సూచించారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్ : నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతి ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్ష దరఖాస్తుకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డీఈఓ శేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతూ, 01-05-2012 నుంచి 30-07-2014 మధ్య జన్మించిన వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వెల్లడించారు. ఆసక్తిగలవారు ఆగస్టు 10వ తేదీలోపు ''సీబీఎస్ఈఐటీఎంఎస్.ఆర్‌సీఐఎల్.జీఓవి.ఇన్/ఎన్‌వీఎస్'' వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తులు

తిరుపతి అర్బన్ : జిల్లాలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల జిల్లా సమన్వయకర్త వి.జయభారతి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ అర్హులైన విద్యార్థులు ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సంబంధిత గురుకుల పాఠశాలలో దరఖాస్తులు అందించాలని కోరారు. 27వ తేదీ ఉదయం 10 గంటలకు పుదూరులోని గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

పది సప్లిమెంటరీలో 72.21శాతం ఉత్తీర్ణత

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో తిరుపతి జిల్లా 72.21శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే 8వ స్థానంలో నిలిచింది. ఈ నెల 2నుంచి 10వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 36 కేంద్రాల్లో పరీక్షను నిర్వహించారు. 4,143మంది బాలురు , 2,747మంది బాలికలు మొత్తం 6,890మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో బాలురు 2,822 (68.11శాతం), బాలికలు 2,153 (78.32శాతం) ఉత్తీర్ణులైనట్లు డీఈఓ శేఖర్ తెలిపారు.

తిరువణ్ణామలై సర్వీసులకు ఆదరణ



చెంగల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి

తిరుపతి అర్బన్ : తమిళనాడులోని తిరువణ్ణామలైకు పౌర్ణమి సందర్భంగా నడుపుతున్న బస్సు సర్వీసులకు విశేష ఆదరణ లభిస్తోందని జిల్లా ప్రజా రవాణాధికారి తిమ్మాడి చెంగల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జూలై మొదటి వారంలో పౌర్ణమి సందర్భంగా 125 సర్వీసులు జిల్లా నుంచి తిరువణ్ణామలైకు నడపనున్నట్లు వెల్లడించారు. గత ఏడాది నవంబర్‌లో తొలుత 7 సర్వీసులు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రతి నెలా బస్సుల సంఖ్య పెంచుతున్నామన్నారు. ఏప్రిల్‌లో పౌర్ణమి ఒక్క రోజు ఏర్పాటు చేసిన సర్వీసులతో రూ.8.34 లక్షలు, మేలో రూ.22.74 లక్షలు, జూన్‌లో 27.14లక్షలు రాబడి వచ్చిందని చెప్పారు. జూలైలో రూ.35లక్షల రాబడి వస్తుందని అంచనాలు వేస్తున్నట్లు తెలిపారు. రాను..పోను ఒకేసారి టికెట్ తీసుకుంటే 10శాతం రాయితీ కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే వేసవి నేపథ్యంలో ఏసీ సర్వీసులను కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వివరించారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్టుమెంట్లు అన్నీ నిండాయి. క్యూ వెలుపల టీబీసీ వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 67,294 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 33,529 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో భక్తులు రూ.4.09 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులు 2 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు.

బక్కచిక్కిన 'బకింగ్‌హామ్'

పురాతనమైన అతి పెద్ద జల మార్గం బకింగ్‌హామ్ కెనాల్. లక్షలాది మందికి జీవనాధారం. ఒకప్పుడు వస్తువుల రవాణాలో కీలకంగా ఉండేది. నిత్యం పడవుల రాకపోకలతో రద్దీగా కనిపించేది. ఇప్పుడు ఆక్రమణలకు గురై బక్కచిక్కిపోయింది. పట్టించుకునేవారు లేక కుంచించుకుపోయింది. రొయ్యల గుంతల నుంచి వచ్చే రసాయనాలు కలిసి కాలుష్యం కోరల్లో చిక్కుకుంది. లక్షలాది మందికి జీవనాధారంగా విలసిల్లిన కాలువలో మత్స్య సంపద అంతరించిపోతోంది. ఈ క్రమంలో కెనాల్ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం నడుంబిగించింది. నిధులు మంజూరు చేసి సర్వేను సైతం శరవేగంగా పూర్తి చేయించింది. అయితే 8 ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధి కార్యాచరణను విస్మరించింది. ఈ నేపథ్యంలో బకింగ్‌హామ్ కెనాల్ ఆధునికీకరణకు తీరప్రాంతం ఎదురుచూస్తోంది. ఇప్పటికైన పనులు ప్రారంభించాలని కోరుతోంది.

- ఆక్రమణలతో కుంచించుకుపోయిన కెనాల్
- కాలువ పునరుద్ధరణకు రూ.3వేల కోట్లు మంజూరుకు గ్రీన్‌సిగ్నల్
- సర్వే పూర్తయినా.. హద్దురాళ్లు నాటించని కేంద్రప్రభుత్వం
- 8 ఏళ్లు గడిచినా పనుల్లో లేని పురోగతి
- జలమార్గం ఆధునికీకరణకు ఎదురుచూస్తున్న తీరప్రాంత వాసులు



దుగరాజపట్నం వద్ద కుంచించుకుపోయిన బకింగ్‌హామ్ కెనాల్



ప్రస్తుతం మొనపాళెం వద్ద జలరవాణ ఆనవాలుతో కనిపిస్తున్న కెనాల్

వాకాడు : సరిగ్గా 127 ఏళ్ల క్రితం 1896లో బకింగ్‌హామ్ కెనాల్ నిర్మించారు. ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాలను కలుపుతూ బంగాళాఖాతం వెంబడి 796 కి.మీ పొడవునా ఈ కాలువ విస్తరించి ఉంది. అలాగే ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 11 తీర ప్రాంత మండలాలను తాకుతూ 178 కి.మీ మేర ఈ కాలవ పయనిస్తుంది. దీన్ని అప్పట్లో బకింగ్ హామ్ అనే బ్రిటీష్ దొర నిర్మించారు. అందుకే కాలువకు బకింగ్ హామ్ కెనాల్ అనే పేరు వచ్చింది. రోడ్డు, రైలు మార్గాల కంటే అత్యంత చౌకగా వస్తువులను రవాణా చేయవచ్చుననే ఉద్దేశంతో ఈ అతిపెద్ద జల మార్గాన్ని ఆనాడు బ్రిటీష్ పాలకులు నిర్మించారు. కాల క్రమంలో పట్టించుకునేవారు కరువై బకింగ్‌హామ్ కెనాల్ ఆక్రమణల చెరలో చిక్కుకుంది. కాలువకు సంబంధించిన విలువైన భూములను కొందరు యథేచ్ఛగా కబ్జా చేసేశారు. ప్రస్తుతం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కావలి, అల్లూరు, విడవలూరు, కొడవలూరు, ఇందుకూరుపేట, తోటపల్లె గూడూరు, ముత్తుకూరు, తిరుపతి జిల్లాలోని చిల్లకూరు, కోట, వాకాడు, తడ, సూళ్లూరుపేట మండలాల పరిధిలో దాదాపు 500 ఎకరాలకు పైగా కెనాల్ భూములు ఆక్రమణకు గురై ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది.

ఒక్కోచోట.. ఒక్కో పేరు!

బకింగ్‌హామ్ కెనాల్‌కు ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరు ఉంది. కాకినాడ నుంచి రాజమండ్రి వరకు గోదావరి కాలువగా, దవళేశ్వరం బ్యారేజ్ నుంచి విజయవాడ వరకు ఏలూరు కాలువగా, విజయవాడ నుంచి పెద గంజాం లాకుల వరకు కొమ్మమూరు కాలువగానూ, పెద్ద గంజాం నుంచి చెన్నై వరకు బకింగ్‌హామ్ కాలువగాను పిలుస్తారు. ఈ కెనాల్ జలరవాణాకే కాకుండా సముద్రతీరంలోని వందలాది గ్రామాలు లక్షలాది ఎకరాలను భారీ వర్షాలు, వరదల సమయంలో కోతకు గురికానివ్వకుండా రక్షణ గోడలా ఆదుకుంటుంది. తీర మండలాల్లో వచ్చే వరద నీరు ఈ కాలువ ద్వారానే సముద్రంలో కలిసేది. ప్రస్తుతం పర్యవేక్షించే వారు కరువై కాలువ ఉనికిని కోల్పోతుంది.

అసలు కొలతలు ఇవి..

సాధారణంగా కెనాల్ సెంటర్ పాయింట్ నుంచి అటు 50 మీటర్లు, ఇటు 50 మీటర్లు వెడల్పు ఉండాలి. కాని ప్రస్తుతం ఆక్రమణల కారణంగా కనీసం 10 మీటర్లు కూడా లేకుండా చిక్కిపోయింది. గతంలో కాలువ నిర్వహణకు మైపాడులో సబ్ డివిజన్ కేంద్ర ఏర్పాటు చేశారు. అల్లూరు, ముత్తుకూరు, సూళ్లూరుపేటలో సెక్షన్ కార్యాలయాలు ప్రారంభించారు. అయితే తర్వాత పట్టించుకునేవారులేక అవి కాస్తా నిరుపయోగంగా మారిపోయాయి.

పూర్వవైభవానికి సర్వే

బకింగ్‌హామ్ కెనాల్‌కు పూర్వ వైభవం తీసుకురావాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం రూ.3వేల కోట్లు మంజూరు చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్పుడు కేంద్రంలో అధికారం సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వం ఒక ధృఢ నిశ్చయంతో ఆధునీకరణ పేరుతో రూ. 3వేల కోట్లును నిధులు మంజూరు చేస్తున్నట్లు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తర్వాత 2015 జూన్ 30వ తేదీన ఢిల్లీ నుంచి సర్వే బృందాలను పంపించింది. వారు శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి మండలం చెన్నాయపాళెం నుంచి సర్వేను ప్రారంభించారు. పక్కా ప్రణాళికతో కావలి నుంచి ఊటుకూరు వరకు ఒక బిట్‌గా, పెన్నా రివర్ కుడితిపాళెం నుంచి ముత్తుకూరు మండలం కృష్ణపట్నం వరకు రెండో బిట్‌గా, కృష్ణపట్నం నుంచి తడ వరకు మూడో బిట్‌గా విభజించుకుని శరవేగంగా సర్వే పూర్తిచేశారు. ఇందుకోసం సరికొత్త గ్లోబల్ జీపీఎస్ టెక్నాలజీని వినియోగించారు. ఈ మేరకు నివేదికలను సిద్ధం చేసి ఆక్రమిత భూములను గుర్తించి ఆయా మండలాల రెవెన్యూ కార్యాలయాలకు పంపించారు. అయితే సర్వే పూర్తి చేసి 8 ఏళ్లు గడుస్తున్నా గుర్తించిన కాలువ భూములకు హద్దురాళ్లు నాటలేదు. కనీసం ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోలేదు. ఇప్పటి వరకు కాలువ పునరుద్ధరణకు పునాదులు సైతం వేయకపోవడం గమనార్హం. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె వద్ద ఫిషింగ్ ఆర్బర్, అలాగే సాగరమాల ప్రాజెక్టు, తమిళనాడులో ఎన్నూరు పోర్టు నిర్మించనున్న నేపథ్యంలో బకింగ్‌హామ్ కెనాల్‌ను ఆధునికీకరిస్తే జల మార్గానికి పూర్వవైభవం వస్తుందని తీరప్రాంతవాసులు అభిప్రాయపడుతున్నారు.

శిథిలమైన లాకులు

బకింగ్ హామ్ కెనాల్‌కు సముద్రపునీరు ఎక్కువగా వస్తే అడ్డుకునేందుకు అక్కడక్కడ లాకులు ఏర్పాటు చేశారు. కానీ పర్యవేక్షణ కరువై లాకులు శిథిలమయ్యాయి. లాకుల వద్ద పనిచేసే లష్కర్లు ఉద్యోగ విరమణ చేశారు. ఆయా స్థానాల్లో ఎవరినీ నియమించకపోవడంతో పలు ప్రాంతాల్లో లాకులు అపహరణకు గురయ్యాయి.

కెనాల్ కలుషితం!

బకింగ్‌హామ్ కాలువ సమీపంలో ఎక్కువ మంది రైతులు రొయ్యల సాగు చేస్తున్నారు. వీరు రొయ్యల గుంతల నుంచి పలు రసాయనాలతో కూడిన నీటిని కెనాల్‌లోకి వదిలేస్తున్నారు. దీంతో కాలువలోని నీరు పూర్తిగా కలుషితమవుతోంది. దీంతో మత్స్య సంపద నశించిపోతోంది.

ఆక్రమణదారులపై చర్యలు



కాలువ పునరుద్ధరణకు గతంలో కేంద్ర బృందం సర్వే చేసింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన అలైన్‌మెంటు పనులు పూర్తి చేసి ఆయా నివేదికలను కేంద్రానికి పంపింది. అయితే దీనిపై ఫైనల్ రిపోర్టు ఇంతవరకు రాలేదు. – శ్రీనివాసులు, కెనాల్ డీఈ నెల్లూరు

పలమార్లు విన్నవించాం



బకింగ్‌హామ్ కెనాల్‌ను పునరుద్ధరిస్తే పూర్వ వైభవం సంతరించుకుంటుంది. కాలువ అభివృద్ధి కోసం పలు మార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వినతులు సమర్పించాం. అయితే సర్వే తోనే సరిపెట్టారు. – సంపత్‌కుమార్, కెనాల్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వల్లమేడు

పేదలకు రూ. 2లక్షల కోట్ల పథకాలు

నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాల ద్వారా రూ.రెండు లక్షల కోట్లను పేద, బడుగు, బలహీన వర్గాలకు అందించామని రాష్ట్ర విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. కుప్పం నియోజకవర్గంలో పల్లెబాట కార్యక్రమంలో భాగంగా ఆయన మొదటి రోజు శుక్రవారం గుడుపల్లె మండలంలో పర్యటించారు. పలు సభల్లో ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల హామీలను పూర్తిగా నెరవేర్చారని చెప్పారు. నాలుగు సంవత్సరాల్లోన్నే ఈ ఘనత సాధించడం ఓ రికార్డుగా అభివర్ణించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ ఆదరిస్తే రెట్టింపు అభివృద్ధికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

- మళ్లీ ఆదరిస్తే రెట్టింపు ఇస్తాం
- ఇచ్చిన హామీలన్ని నెరవేర్చాం
- కుప్పం అభివృద్ధి బాధ్యత నాది
- గుడుపల్లె పల్లెబాటలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



బెగ్గిలిపల్లె సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. చిత్రంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం

కుప్పం/గుడుపల్లె: కుప్పం నియోజకవర్గంలో పల్లెబాట కార్యక్రమంలో భాగంగా బెగ్గిలిపల్లి, శెట్టిపల్లి, గుడికొత్తూరు, యామిగానిపల్లి, కనమనపల్లి, కంచిబందార్లపల్లి, గుండ్లసాగరం, పాగురుపల్లి, బిసానత్తంలో మంత్రి పెద్దిరెడ్డి పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ఇన్ని రూ.కోట్లను ఏ రాష్ట్రంలోనూ ఖర్చు చేసిన దాఖలాలు లేవన్నారు. ముఖ్యమంత్రి సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చూస్తారని, అలాంటి నాయకుడు దొరకడం మనం చేసుకున్న పుణ్యమని తెలిపారు. చంద్రబాబు కేవలం రాజకీయ లబ్ధికోసమే ప్రయత్నిస్తారని, ఈ విషయాన్ని కుప్పం ప్రజలు గుర్తించారన్నారు. ఎన్నికల సమయంలో 600 హామీలు ఇచ్చిన బాబు తన పాలనలో ఒక్కటీ నెరవేర్చలేకపోయారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం దశల వారీగా మహిళల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారని తెలిపారు.నమ్మిన వారిని మోసం చేయడం చంద్రబాబు వంతు అయితే... నమ్మిన వారిని ఎలాగైనా కాపాడుకోవడం జగన్‌మోహన్‌రెడ్డి నైజమని పేర్కొన్నారు.

కుప్పం అభివృద్ధి నాదీ బాధ్యత

35 ఏళ్లుగా కుప్పం ఓట్లతో గెలుస్తున్న చంద్రబాబు చేసింది ఏమి లేదని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే కుప్పానికి రెవెన్యూ, పోలీసు డివిజన్లు వచ్చాయని తెలిపారు. నియోజక వర్గ కేంద్రమైన కుప్పంను మున్సిపాలిటీగా చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మున్సిపాలిటీకి తక్షణ అభివృద్ధికి రూ.66 కోట్లు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించిన నాయకుడు జగన్ అని తెలిపారు. యామిగానిపల్లె, ముద్దనపల్లె వద్ద రెండు సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల నిర్మాణం కోసం మరో రూ.500 కోట్లు కేటాయిస్తామన్నారు. సాధారణంగా ప్రతిపక్ష నాయకుడి నియోజకవర్గాలను అధికార పక్షం పట్టించుకోదని, తాము అలా చేయడం లేదన్నారు. కుప్పాన్ని, పులివెందుల, పుంగనూరుకు సమానంగా భావించి అభివృద్ధి చేసే బాధ్యత తనదని పేర్కొన్నారు. ఈ పర్యటనలో మంత్రి వెంట జిల్లా పరిషత్ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

3నెలల్లో కుప్పానికి హంద్రీ–నీవా నీళ్లు

మూడు నెలల్లో హంద్రీ–నీవా కాలువ పనులు పూర్తి చేసి కుప్పానికి కృష్ణా జలాలను తీసుకువస్తామని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుప్పం పర్యటనలో ఇచ్చిన హామీల మేరకు పనులు వేగంగా సాగుతున్నట్లు చెప్పారు. ఈ సభలో ముఖ్యమంత్రి ఎన్నికల్లోపు కుప్పానికి కృష్ణాజలాలు తీసువస్తామని హామీ ఇచ్చారని, మరో మూడు నెలల్లో కుప్పం కృష్ణాజలాలు తీసుకు వచ్చేందుకు పనులు వేగంగా సాగుతున్నట్లు వివరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో హంద్రీనీవా పనులు 90శాతం పూర్తయ్యాయని పేర్కొన్నారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో 10శాతం పనులు చేయలేక విమర్శలు చేయడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. ఇంకా చాలా ప్రాజెక్టులు తీసుకువస్తామంటే కోర్టులకు వెళ్లి చంద్రబాబు అడ్డుపడుతున్నారని విమర్శించారు. ఎక్కడ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పేరువస్తోందని బాబు ఆందోళన చెందుతున్నారని ఆరోపించారు.

సకల సేవలకు 'సురక్ష'



ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే ఆదిమూలం, జేసీ బాలాజీ, ఆర్డీఓ కనకనరసారెడ్డి తదితరులు

- జగనన్న సురక్ష పథకంపై జేసీ సమీక్ష
- అధికారులకు బాధ్యతలు అప్పగింత
- నియోజకవర్గాల వారీగా పర్యవేక్షకుల నియామకం

తిరుపతి అర్బన్ : ప్రభుత్వ పథకాలు, సేవలను అర్హులందరికీ అందించేందుకే 'జగనన్న సురక్ష'ను ప్రారంభించినట్లు జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. శుక్రవారం తాడేపల్లె క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సురక్ష పథకం లక్ష్యాలను వర్చువల్ సమావేశంలో వివరించారు. కలెక్టరేట్ నుంచి జేసీతోపాటు ఎమ్మెల్యే ఆదిమూలం, డీఆర్ఓ కోదండరామిరెడ్డి, ఆర్డీఓలు వి.కనకనరసారెడ్డి, రామారావు పాల్గొన్నారు. అనంతరం పథకం అమలు తీరుతెన్నులపై జేసీ అధికారులతో సమీక్షించారు. ఈ నెల 24 నుంచి 31వ తేదీ వరకు ఇంటింటికీ వలంటీర్లు వెళ్లి సమస్యలు తెలుసుకుంటారన్నారు. జూలై 1 నుంచి 31వ తేదీ వరకు ఆయా సమస్యల పరిష్కారంపై సచివాలయాల్లో క్యాంపులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో వలంటీర్లు చురుకైన పాత్ర పోషించాలని, ఎవరైనా అర్హులకు ప్రభుత్వ పథకం అందకుంటే వారి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి మండలంలో రెండు టీమ్‌ల ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వీరిని టాస్క్‌ఫోర్స్ బృందాలు పర్యవేక్షిస్తాయన్నారు. సాంకేతిక సమస్యల పరిష్కారానికి సచివాలయాల జిల్లా కో–ఆర్డినేటర్ జగదీష్, ఏపీ ఆన్‌లైన్ కో–ఆర్డి నేటర్ వెంకటేష్, టీసీఎస్ రీసోర్స్ పర్సన్ భవానిశంకర్‌ను నియమించినట్లు వివరించారు.

టాస్క్‌ఫోర్స్ బృందాలు

తిరుపతి : ఆర్డీఓ కనకనరసారెడ్డి, సివిల్ సప్లయ్ డీఎం సుమతి, జిల్లా పట్టు పరిశ్రమ అధికారి గీతా రాణి

చంద్రగిరి : స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రోటోకాల్ భాస్కర్ నాయుడు, డీపీఓ రాజశేఖర్ రెడ్డి, డీఎల్‌పీఓ రూపారాణి

శ్రీకాళహస్తి: ఆర్డీఓ రామారావు, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ భాస్కర్ రెడ్డి

సత్యవేడు : ఎస్సీ వెల్ఫేర్ అధికారి చెన్నయ్య, డీఈఓ వి.శేఖర్, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్

సూళ్లూరుపేట: ఆర్డీఓ చంద్రముని, పశుసంవర్థక శాఖ అధికారి రవికుమార్, హార్టికల్చర్ అధికారి దశరథరామిరెడ్డి

గూడూరు, వెంకటగిరి : ఆర్డీఓ కిరణ్ కుమార్, డీఎల్‌పీఓ వెంకటరామన్ , డీఎల్‌డీఓ వాణి

నూతన భవనంలో ఎస్పీ కార్యాలయం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం : తిరుపతిలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో నూతనంగా నిర్మించిన ఎస్పీ కార్యాలయ భవనాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణ స్వామి శుక్రవారం ప్రారంభించారు. మంత్రి పెద్దిరెడ్డి శిలాఫలకాన్ని ఆవిష్కరించగా.. డిప్యూటీ సీఎం నారాయణస్వామి రిబ్బన్ కట్ చేశారు. కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, త్రిపుర డీఐజీ ఆవుల రమేష్ రెడ్డి, శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ చిరంజీవిరెడ్డి, టీటీడీ సీవీఎస్ఓ నరసింహ కిషోర్, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి పాల్గొన్నారు.

– శ్రీరంగరాజపురం మండలానికి చెందిన జోత్స్న (పేరు మార్చాం) అనే యువతికి, నగరికి చెందిన రాజీవ్ అనే యువకుడికి ఈ ఏడాది జనవరిలో పెళ్లి నిశ్చయమైంది. అయితే పెళ్లికి ముందు వరుడు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని యువతి అందరి ముందు తేల్చి చెప్పింది. దీంతో ఆ యువకుడు అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకుని రిపోర్టులు పంపించాడు. ఆ తర్వాత వివాహం జరిగింది.

– బెంగుళూరులో నివాసముంటున్న శరణ్య (పేరుమార్చాం), తవణంపల్లెకు చెందిన రమేష్ ఇద్దరూ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పనిచేస్తున్నారు. ఇద్దరికి ముఖపరిచయం ఉంది. మార్చిలో వీరికి పెద్దల అంగీకారంతో వివాహమైంది. అయితే పెళ్లికి ముందు ఇద్దరూ స్వచ్ఛందంగా వైద్యుడిని సంప్రదించి అన్ని రకాల పరీక్షలు చేయించుకున్నారు. ఆ మేరకు సలహాలు, సూచనలు తీసుకున్నారు.

– తిరుపతి బాలాజీకాలనీకి చెందిన అనితకి (పేరుమార్చాం) సమీప బంధువుతో 2022 నవంబరు 26వ తేదీన తల్లిదండ్రులు పెళ్లి చేశారు. నెల తిరగక ముందే పంచాయితీ పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కింది. పోలీసులు విచారించగా వరుడికి అనారోగ్య సమస్యలు ఉన్నట్లు అతడి కుటుంబీకులే ఒప్పుకున్నారు. దీంతో యువతి వెంటనే విడాకుల కోసం దరఖాస్తు చేసుకుంది. వీరి పెళ్లి మూణ్ణాళ్ల ముచ్చటగానే మిగిలింది.

ఆనంద దాంపత్యానికి ఆరోగ్య పరీక్షలు



పెళ్లంటే నూరేళ్ల పంట.. వివాహంతో రెండు జీవితాలు ముడిపడతాయి.. రెండు కుటుంబాల నడుమ బాంధవ్యాలు కలుస్తాయి.. ఆదిలోనే హంసపాదు అన్నట్లు వధూవరుల్లో ఎవరో ఒకరికి అనారోగ్య సమస్యలు ఉన్నట్లు తెలియడంతో కొన్ని పెళ్లిళ్లు విచ్ఛిన్నమవుతున్నాయి. మాయదారి రోగాల కారణంగా నూతన జంటలు విడిపోతున్నాయి. ఈ క్రమంలో యువతీయువకులు మ్యారేజ్‌కు ముందుగానే హెల్త్ టెస్ట్‌లు చేయించుకునేందుకు మొగ్గుచూపుతున్నారు. ఆనంద దాంపత్యానికి ఆరోగ్య పరీక్షలు అవసరమని భావిస్తున్నారు.. కోవిడ్ తర్వాత నుంచి ఈ విధానానికి అధిక సంఖ్యలో ఆసక్తి కనబరుస్తున్నారు. – సాక్షి, తిరుపతి డెస్క్

- పెళ్లికి ముందే హెల్త్ టెస్ట్‌లు
- స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న వధూవరులు
- కోవిడ్ అనంతరం పెరిగిన అవగాహన
- మార్పు మంచిదే అంటున్న వైద్యులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3 వేలకు పైగా కల్యాణ మండపాలు ఉన్నాయి. లగ్నాల మాసాల్లో రోజూ వందల సంఖ్యలో పెళ్లిళ్లు జరుగుతుంటాయి. ముఖ్యంగా తిరుమల, తిరుపతి, కాణిపాకం, చిత్తూరు, శ్రీకాళహస్తి తదితర క్షేత్రాల్లో ఎక్కువగా పెళ్లి బాజాలు మోగుతుంటాయి. నూతన వధువరులు వందేళ్లు కలిసి జీవించాలనే పెళ్లి నాడూ పెద్దలు ముడి వేయిస్తుంటారు. కానీ ఎక్కువ మంది ఆ వివాహ బంధాన్ని కాపాడుకోలేక మధ్యలోనే విడిపోతున్నారు. పెళ్లి తర్వాత ఎదురయ్యే సమస్యల్లో కొన్నిసార్లు పెద్దలు, సైకాలజిస్టులు, పోలీసులు సర్దిచెప్పి దాంపత్య జీవితాన్ని నిలబెడుతున్నారు. కాని ఆరోగ్య సమస్యలను దాచి వివాహం చేసిన సందర్భాల్లో మాత్రం విడాకులే శరణ్యం అవుతున్నాయని వైద్యులు, సామాజిక వేత్తలు చెబుతున్నారు. అయితే ఇప్పుడు వివాహానికి ముందు వధువు, వరుడు ఆరోగ్య పరీక్షల రిపోర్టులను తల్లిదండ్రులు అడుగుతున్నారు. అంతా సక్రమంగా ఉంది అనుకున్నాకే పెళ్లికి ముహూర్తం ఖరారు చేసుకుంటున్నారు. ఈ విధానం దాంపత్య జీవితానికి శ్రేయస్కరమని అందరూ విశ్వసిస్తున్నారు.

ఆలోచించి.. అడుగులు వేద్దాం.

వివాహం అంటే ప్రతి ఒక్కరి జీవితంలో కీలక ఘట్టంగా భావిస్తారు. అంచనాలకు మించి హడావిడీ చేస్తుంటారు. పెద్దమొత్తంలో సొమ్ము వెచ్చించి అంగరంగ వైభవంగా జరిపిస్తుంటారు. అయితే వేద మంత్రాల మధ్య ఒక్కటైన ఆ బంధం కొద్ది రోజులకే విడిపోతే ఆ ప్రభావం వారి మీదనే కాదు కుటుంబ సభ్యులపై కూడా పడుతుంది. ముఖ్యంగా ఆరోగ్య సమస్యలను దాచి వివాహం చేసుకున్న జంటలే ఎక్కువగా విడిపోతున్నారని ఓ అధ్యయనంలో తేలింది. అందుకే పెద్దలు అటు ఏడు తరాలు.. ఇటు ఏడు తరాలు చూడాలనే సంకేతాన్ని ఇచ్చారని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఆరోగ్య సమస్యలను దాచి వివాహం చేస్తే దంపతులకు తీరని అన్యాయం చేసిన వారవుతారని సామాజిక నిపుణులు, వైద్యులు సైతం హెచ్చరిస్తున్నారు. వివాహానికి ముందు అమ్మాయి, అబ్బాయి హెల్త్ చెకప్ చేయించుకుంటే ఎటువంటి సమస్య ఉండదు. వారికి తెలియని వ్యాధులు కూడా ఉండొచ్చని వైద్యులు చెబుతున్నారు. అవగాహనతో వివాహం చేసుకుంటే ఎలాంటి సమస్యలు ఉండవని సూచిస్తున్నారు.

పరీక్షలు ఇలా...

- ఎస్‌టీడీ (సెక్సువల్లీ ట్రాన్స్‌మిటెడ్ డిసీజ్) టెస్ట్. ఇందులో ఎయిడ్స్, సిఫిలిస్, గనేరియా తదితర వ్యాధులు ఉంటే బయటపడుతాయి. అవి ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అవకాశం ఉంది. ఫలితంగా సంతానం కూడా కలగక బాధపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.
- హిమోగ్లోబిన్ ఎలక్ట్రో ఫోరోసిస్ టెస్ట్‌తో తలసీమియా, సికిల్ సెల్ డిసీజ్ లాంటి అనువంశిక డిజార్డర్ తెలిసిపోతుంది. ఒకవేళ వధువు, వరుడు ఇద్దరు ఈ వ్యాధికి గురైతే సంతానానికి కూడా సోకుతుంది. అందుకే వివాహానికి ముందే టెస్ట్ చేయించుకుంటే భయంకరమైన రోగాల నుంచి బయటపడొచ్చు.
- ఫెర్టిలిటీ టెస్ట్‌తో సంతాన సామర్థ్యం తెలిసిపోతుంది. జెనెటిక్ డిసీజ్ చెకప్‌తో వంశపారంపర్య వ్యాధులు ఉంటే తెలుస్తుంది. వాటితో పాటు జనరల్ హెల్త్ చెకప్ కూడా అవసరమేనని వైద్యులు సూచిస్తున్నారు. దంపతులకు ఆరోగ్య విషయాలపై అవగాహనతో ఉంటే వారి దాంపత్య జీవితం సాఫీగా సాగుతుందని వెల్లడిస్తున్నారు.

ఏ మాత్రం తప్పులేదు



పెళ్లికి ముందు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడమంటే చాలామంది విడ్డూరంగా చూస్తున్నారు. ఓ రకంగా ఇబ్బంది పడుతున్నారు. ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంలో ఏమాత్రం తప్పు లేదు. పెళ్లికి ముందు వారి వ్యాధులను దాచిపెట్టడం మంచిది కాదు. దాని దుష్పరిణామం వారు జీవితాంతం భరించాల్సి వస్తుంది.

– రాజశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

అర్థం చేసుకోవాలి



పెళ్లికి ముందు ఒకరినొకరు అర్థం చేసుకోవాలి. శారీరక, మానసిక, ఆర్థిక విషయాలను చర్చించుకుని అవగాహనకు రావాలి. ప్రస్తుత పరిస్థితుల్లో తల్లిదండ్రులు కేవలం ఆర్థిక విషయాలకే పరిమితమవుతున్నారు. అయితే సంబంధాలు కుదుర్చుకునేప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. ముందుగా ఆరోగ్య పరీక్షలు చేయించాలి. ప్రస్తుతం చాలామంది ఆలస్యంగా వివాహాలు చేసుకుంటున్నారు. దీంతో ఇబ్బందులు వస్తాయి. – హర్షవర్ధన్, డీపీఎంఓ



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,230
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,409
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,200
రిటైల్ వెండి గ్రాము	రూ.72.20

టీడీపీ కోవర్టు 'ఆనం'



నెల్లూరు(సెంట్రల్): వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన ఆనం రామనారాయణరెడ్డి.. తెలుగుదేశం పార్టీకి కోవర్టుగా పనిచేశారని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. నెల్లూరులోని ఆయన నివాసంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆనం ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి టీడీపీ వాళ్లతో పూర్తిగా టచ్‌లో ఉంటూ వచ్చారన్నారు. ప్రభుత్వం స్థానికంగా ఏ అభివృద్ధి పనిచేయాలని భావించినా ఆనం అడ్డుపడుతూ వచ్చారన్నారు.

స్మగ్లర్లు ఎవరో తెలుసుకో లోకేశ్

లోకేశ్ పాదయాత్ర సందర్భంగా వెంకటగిరి నియోజకవర్గంలో ఏ ఒక్క వైఎస్సార్‌సీపీ నాయకుడు, కార్యకర్త టీడీపీలోకి వెళ్లలేదన్నారు. లోకేశ్ వెంకటగిరిలో సభ నిర్వహించి ఈ ప్రాంతంలో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్నారని ఆరోపించారని, కానీ లోకేశ్ పక్కన వేదికపై ఉన్న వారే స్మగ్లింగ్ చేసే వ్యక్తులని ఆయన తెలుసుకోలేక పోయారని చురకలంటించారు. నేదరుమల్లి జనార్దన్‌రెడ్డి, రాజ్యలక్ష్మి హయాంలో వెంకటగిరిలో అనేక అభివృద్ధి పనులు జరిగాయని గుర్తుచేశారు. ఎవరో రాసిచ్చిన పేపర్ చదవడం కాదని, వాస్తవాలు తెలుసుకోవాలని లోకేశ్‌కు సూచించారు.

బాలిక కిడ్నాప్ కేసులో యువకుడి అరెస్ట్



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

వరదయ్యపాళెం: మైనర్ బాలికను ప్రేమ పేరుతో వంచించడమే కాకుండా, కిడ్నాప్ చేసిన కిరణ్ అనే యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. వివరాలు.. గురువారం మండలంలోని సీఎల్ఎన్‌పల్లెకు చెందిన ఓ బాలిక(16)ను, మరదవాడకు చెందిన వీరరాఘవులు అలియాస్ కిరణ్ (22) పెళ్లి చేసుకుంటానని నమ్మించి తన వెంట బలవంతంగా తీసుకెళ్లాడు. దీనిపై బాలిక తల్లిదండ్రులు వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు శుక్రవారం సాయంత్రం నిందితుడు కిరణ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని నెలవాయి వద్ద కేటీ రోడ్డుకు పక్కనే ఉన్న పంట కాలువలో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు శుక్రవారం వెలుగులోకి వచ్చింది. మృతుడికి సుమారు 40 ఏళ్లు ఉంటాయని, ఒంటిపై జీన్స్ ఫ్యాంట్, షర్ట్, ఎడమ చేతికి రాగి కడియం ఉందని పోలీసులు తెలిపారు. కాలువలో మృతదేహం తేలుతూ కనిపించడంతో స్థానిక రైతులు గమనించి సమాచారం అందించినట్లు వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ మంజునాథరెడ్డి చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మార్గదర్శిపై అంత ప్రేమెందుకు..?

తిరుపతి లీగల్ : ఆర్థిక నేరాలకు పాల్పడిన మార్గదర్శి చిట్స్‌పై టీడీపీ, జనసేన, కొందరు కాంగ్రెస్ నేతలకు అంత ప్రేమ ఎందుకని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ తిరుపతి న్యాయవాదులు ప్రశ్నించారు. సోమవారం వారు మాట్లాడుతూ ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసిన రామోజీరావుకు ఎందుకు మద్దతు పలుకుతున్నారని మండిపడ్డారు. మార్గదర్శి నిధుల మళ్లింపుపై మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్ వేసిన కేసును సుప్రీం కోర్టు స్వీకరించిందన్నారు. కోర్టులు, చట్టాలపై నీతులు వల్లించే నేతలు మార్గదర్శి అక్రమాలను సమర్థిస్తూ ప్రెస్‌మీట్లు పెట్టడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కేసును పారదర్శకంగా దర్యాప్తు చేస్తున్న సీఐడీ అధికారులను టీడీపీ నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడడం దారుణమన్నారు. సీఐడీ చీఫ్‌పై జనం సొమ్మును దిగమింగిన ఎంపీ రఘురామకృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు దొరబాబు, మోహన్, రాజేష్, విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాల పట్టివేత



పట్టుబడిన మత్తు పదార్థాలను చూపుతున్న అధికారులు

తిరుపతి క్రైం : నగరంలోని పెద్దకాపువీధిలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన మెడికల్ మత్తు పదార్థాలను ఎస్‌ఈబీ పోలీసులు శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. సీఐ నాగరాజారెడ్డి కథనం మేరకు.. హరిత అనే మహిళ వద్ద బిల్లులు లేకుండా మత్తుమందులు ఉన్నట్లు సమాచారం అందడంతో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సుభాషిణితో కలిసి దాడి చేశామన్నారు. హరితకు ఎస్ఎల్ఎన్ మెడికల్ షాపు ఉన్నట్లు గుర్తించామని, అందులో బిల్లులు లేని మత్తుపదార్థాలను విక్రయిస్తున్నట్లు తెలిసిందని వెల్లడించారు. నిందితురాలిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

చీటీలు చదివి.. చీటింగ్ మాటలు

- లోకేష్ పాదయాత్రలో అన్నీ అసత్య ప్రచారాలే
- టీడీపీ నేతల మాటలను ప్రజలు నమ్మేరోజులు పోయాయి
- తిరుపతి ఎంపీ గురుమూర్తి



తిరుపతి ఎంపీ డాక్టర్ ఎం గురుమూర్తి

వెంకటగిరి: టీడీపీ అధికారంలో ఉన్నన్ని రోజులు దోచుకోవడం.. దాచుకోవడం తప్ప వెంకటగిరి అభివృద్ధిని పట్టించుకోలేదని, రాజకీయ అవసరాలకోసం పాదయాత్రలో అసత్య ప్రచారాలు చేస్తున్న లోకేశ్ మాటలు ప్రజలు నమ్మరని తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టేలా ఎవరో రాసిచ్చిన చీటీల్లో ఉన్న చీటింగ్ మాటలు చెపుతున్న లోకేశ్ నిజానిజాలు తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వెంకటగిరి అభివృద్ధి కోసం ఎంపీ నిధులు రూ.1.05 కోట్లతో ఎల్‌ఈడీ దీపాలు వేయించి వెలుగులు నింపామన్నారు. వెంకటగిరి పట్టణంలోని సీసీ రోడ్ల కోసం రూ.13 లక్షలు కేటాయించామన్నారు. బాలాయపల్లి మండలం కామకూరులో రూ.8 లక్షలతో వాటర్ ప్లాంట్ నిర్మించామని తెలిపారు. నియోజకవర్గంలో రోడ్ల విస్తరణ, పటిష్టత కోసం రూ.45 కోట్లు సీఆర్‌ఐఎఫ్ నిధులు మంజూరు చేయించినట్లు వివరించారు. ఏర్పేడు–పెంచలకోన జాతీయ రహదారిపై వెంకటగిరిలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కోసం రూ.1.04 కోట్లకు ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయని త్వరలో నిధులు మంజూరు కానున్నాయని చెప్పారు.

లోకేశ్ విమర్శలు అర్థరహితం

వెంకటగిరి రైల్వేస్టేషన్ వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం 2021లోనే కేంద్రమంత్రి నితిన్ గడ్కారికి ప్రతిపాదనలు పంపి స్వయంగా కోరగా 2022–23 బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామని చెప్పారని త్వరలో మరోసారి కేంద్రమంత్రిని కలిస్తున్నానన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం గురించి ఎవరూ పట్టించుకోలేదని లోకేశ్ పాదయాత్రలో మాట్లాడడం అర్థరహితమని చెప్పారు. వెంకటగిరి కేంద్రీయ విద్యాలయంలో 10వ తరగతి వరకే ఉండేదని, విద్యార్థులు ఇంటర్ విద్య కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని తెలిసి తాను కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఈ ఏడాది నుంచే ఇంటర్ విద్యను ప్రారంభించారని గుర్తుచేశారు. తాను ఎంపీ అయిన రెండేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనలు, సహకారంతో తిరుపతి పార్లమెంట్ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు తెలియజేశారు. లోకేశ్ పాదయాత్ర ఇప్పటికే ప్రజాదరణ కోల్పోయిందన్నారు. ఆయన లోకల్ లీడర్లు రాసిచ్చిన చీటీలు చదివి అసత్య ప్రచారాలు చేస్తే ప్రజలే బుద్ధి చెప్పే రోజులు ఆసన్నమయ్యాని తెలియజేశారు.

అడుగడుగునా తిరుగులేని ఆదరణ

- మహాపాదయాత్రలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి నీరా'జనం'
- ఆత్మీయంగా స్వాగతించిన పెదబైనపల్లె వాసులు



ధ్యాన మందిరం ప్రారంభోత్సవంలో మోహిత్‌రెడ్డి



వృద్ధుడిని ఆప్యాయంగా పలకరిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల : చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గడప గడపకు మహాపాదయాత్రకు అడుగడుగునా తిరుగులేని ఆదరణ లభిస్తోంది. శుక్రవారం పెదబైనపల్లె పంచాయతీ శంఖంపల్లె, దాసర్లపల్లె, బైనపల్లె, కందేరి ఇండ్లు, గొల్లవారిపల్లె, దళితవాడలో ఆయన పర్యటించారు. ప్రతిచోటా ప్రజలు ఆత్మీయంగా స్వాగతం పలికారు. ఎల్లప్పుడూ అండగా ఉంటామని స్వచ్ఛందంగా భరోసా ఇచ్చారు. మోహిత్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులను తెలియజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. పెద్దబైనపల్లెలో రూ.5 లక్షలతో నిర్మించిన యోగా ధ్యాన మందిరాన్ని ప్రారంభించారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి తిరుగులేని విజయం సాధిస్తుందని స్పష్టం చేశారు. కులమతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేయడంలో జగనన్న దేశానికి ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారని కొనియాడారు. జగనన్నతోపాటు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆశీస్సులతో ఎమ్మెల్యే అభ్యర్థిగా చంద్రగిరి నుంచి పోటీ చేయనున్నట్లు తెలిపారు. పెదబైనపల్లె పంచాయతీలో రూ.62.50 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. జగనన్న సమావేశ మందిరం, ఆర్‌ఓ ప్లాంట్ నిర్మించామని, శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించామని వివరించారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటి వరకు రూ.9.80 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.

స్విమ్స్‌లో అత్యాధునిక వైద్యం

- టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుపతి తుడా : స్విమ్స్‌లో అత్యాధునిక వైద్యసేవలు అందించేందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలను టీటీడీ అందించేందుకు సిద్ధంగా ఉందని ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. స్విమ్స్‌లో శుక్రవారం టీటీడీ జేఈఓ సదాభార్గవి, ఎఫ్ఏ అండ్ సీఈఓ బాలాజీ, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మతో కలిసి స్విమ్స్ అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన ఆధునిక వైద్యాన్ని అందించేందుకు వైద్యులు మరింతగా కృషి చేయాలన్నారు. ఆధునిక వైద్య పరికరాలను అందించేందుకు టీటీడీ ముందుంటుందన్నారు. అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ప్రతిపాదనల మేరకు అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రోగులకు సులభంగా వైద్యసేవలు అందించేందుకు చొరవ తీసుకోవాలని సూచించారు. ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్, రోగుల సహాయకులకు అవసరమైన వసతులు కల్పించాలని సూచించారు. వివిధ వార్డులను పరిశీలించారు. అక్కడ అందుతున్న వైద్యసదుపాయాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పీఆర్వో రవి, ఐటీ జనరల్ మేనేజర్ సందీప్‌కుమార్ రెడ్డి, వైద్యాధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సజీవదహనం కేసులో నిందితుడి అరెస్టు?



చాణక్య ప్రతాప్ (ఫైల్)

చంద్రగిరి: సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సజీవదహనం కేసులో ప్రధాన సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న టీడీపీ నాయకుడు చాణక్య ప్రతాప్‌ను పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. రెండు నెలలుగా పోలీసుల కళ్లుగప్పి తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని చంద్రగిరి పోలీసులు తిరుపతిలో అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏప్రిల్ ఒకటో తేది అర్ధరాత్రి మండలంలోని గంగుడుపల్లె–అనుపల్లె మార్గంలోని కురవకణం వద్ద సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నాగరాజును రుపంజయ, చాణక్య ప్రతాప్‌తో పాటు మరికొందరు కలసి దారుణంగా హత్య చేసి, కారులో సజీవదహనం చేశారు. ఈ కేసును విచారించిన పోలీసులు హత్యకు కారణకులైన రుపంజయతో పాటు మరికొందరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసులో ఏ–2 నిందితుడిగా ఉన్న చాణక్య ప్రతాప్ రెండు నెలలుగా పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం తిరుపతిలోని ఓ లాడ్జిలో చాణక్య ప్రతాప్ ఉన్నట్లు సమాచారం రావడంతో, చంద్రగిరి పోలీసులు మెరుపుదాడి చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. వెదురుకుప్పం మండలంలో టీడీపీలో కీలకంగా ఉండడంతో చాణక్య ప్రతాప్ తన రాజకీయ అండతో ఇన్నాళ్లు తప్పించుకుని తిరుగుతున్నాడని బాధితుడి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై చంద్రగిరి సీఐ రాజశేఖర్‌ను వివరణ కోరగా...ఇప్పటి వరకు అరెస్టు చేయలేదని, త్వరలోనే పూర్తి వివరాలను తెలియజేస్తామని తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

తిరుపతి లీగల్ : నిర్లక్ష్యంగా బస్సు నడిపి ఓ వ్యక్తి మృతికి కారకుడైన డ్రైవర్‌కు రెండేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తిరుపతి ఆరో అదనపు జూనియర్ సివిల్ జడ్జి విజయ్ చందర్ రాణా శుక్రవారం తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి.భాను కిరణ్మయి కథనం మేరకు.. పి.పద్మనాభం తిరుమల డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 2018 జనవరి 30న తిరుపతిలో పి.మునెయ్య అనే వ్యక్తిని బస్సుతో ఢీకొన్నాడు. న్యాయమూర్తి శిక్ష విధించారు.